విశాలాంధ్ర విజయనగరం
గురువారం 14, నవంబర్ 2024
పేజీ నెం. 8

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు పీతల జగదీష్ ఎంపిక

విశాలాంధ్ర - గుర్ల : ఈనెల 9, 10, 11 తేదీల్లో గుంటూరు జిల్లా, బాపట్ల నందు రాష్ట్ర స్థాయి అండర్ 14 కబడ్డీ పోటీలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన.ఈ పోటీలలో రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుండి సుమారు 350 మంది క్రీడాకారులు, క్రీడా కారిణులు పాల్గొన్నారు. ఈ పోటీలలో విజయ నగరం జిల్లా బాలుర జట్టుకు గుర్ల మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వల్లాపురం విద్యార్థి పీతల జగదీష్ కెప్టెన్గా వ్య వహరించి, విజయ నగరం జిల్లా బాలుర జట్టును ద్వితీయ స్థానంసాధించటంలో ఉత్తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి, ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికైనాడు. డిసెంబర్ నెలలో మహా రాష్ట్రలో జరుగు జాతీయస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొననున్నట్లు పి.డీ ఎం.తిరుపతి రావు తెలియ జేశారు. ఇతడిని వల్లాపురం ప్రధానో పాధ్యా యులు వి.అప్పారావు ఇతర ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

నేడు మిమ్స్‌లో చైల్డ్ డవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

మిమ్స్ వైద్య చరిత్రలో మరో అధ్యాయం మొదలు

విశాలాంధ్ర - విజయనగరంటౌన్ : జిల్లా వైద్య చరిత్రలో మిమ్స్ ఒక చరిత్ర కలిగిన సంస్థగా పేరొందింది. సామాన్యులనుంచి సంపన్నుల వరకు అందరికీ అందుబాటులో వైద్య అందించడమే కాకుండా ప్రతీ రోగితోపాటు వారి కుటుంబసభ్యుల మనస్సులో మిమ్స్ ఒక చోటు దక్కించుకుంది. ఇప్పటికే ఏవైద్యకళాశాలకు సాధ్యం కాని అనేక సంక్షేమ పథకాలను ఆర్థిక లాభాలను ఆశించకుండా అమలు చేస్తున్న ఈపేదల సంస్థ వైద్య చరిత్రలో మరో అద్యాయానికి తెరతీస్తోంది. అదే చైల్డ్‌డవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయడం. జిల్లా వాసులతోపాటు చుట్టుపక్కల జిల్లాల ప్రజలకు ఇది నిజంగా శుభవార్తే. ప్రస్తుత పరిస్థితిలో చిన్న పిల్లలకు తగిన వైద్యం అందించేందుకు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయాన్ని గుర్తించిన మిమ్స్ యాజమాన్యం చైల్డ్ డవలప్ఎంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈమేరకు గురువారం ఆసుపత్రి ప్రాంగణంలో వైద్య పరంగా మరో అడుగు ముందుకువేసి ఈచైల్డ్‌డవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించనున్నారు. ఎంతో అనుభవజ్ఞులైన చిన్న పిల్లల వైద్యనిపుణులతోపాటు అత్యాధునిక వైద్య పరికరాలు, మిషనరీలను ఏర్పాటు చేసారు. చైల్డ్ డవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు మిమ్స్ చైర్మన్ అల్లూరి సత్యనారాయణరాజు.బిహెచ్‌వికె ప్రవీణ్‌వర్మ (మేనేజింగ్‌ట్రస్టీ), డి.రామకృష్ణరాజు (లైఫ్‌ట్రస్టీ)లు తెలిపారు.

సీతం కళాశాలలో అలేఖస్ వారిచే పూల్ క్యాంపస్ డ్రైవ్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం అలేఖస్ సాల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారిచే ఎం.బి. ఏ, బి.బి. ఏ విద్యార్థులు లకు పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించబడినది. దీనికి జిల్లా నుంచి పలు కాలేజీ ల విద్యార్థిని విద్యార్థులు హాజరు అయ్యేరు. వీరికి జామ్ మరియు గ్రూప్ డిస్కషన్స్ నిర్వహించి 40 విద్యార్థిని విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. ఈ ఎంపిక ప్రక్రియను అలేఖస్ డైరెక్టర్ ఆపరేషన్స్ పి వినీల, హెచ్ ఆర్ మేనేజర్ ఎస్ లక్ష్మి రేణుక నిర్వహించేరు. సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ ఎం.బి.ఏ, బి.బి.ఏ విద్యార్థులకు ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని దానికి వారు ఎల్లప్పుడూ తయారు అయ్యి ఉండాలని విద్యార్థులకు తెలియజేసేరు. అలేఖస్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసేరు. సీతం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి వి రామ మూర్తి మాట్లాడుతూ ఎం. బి. ఏ, బి.బి. ఏ విద్యార్థులకు మరిన్ని అవకాలను కల్పిస్తామని తెలియజేసేరు. ఇ కార్యక్రమాన్ని డీన్ ఫ్లేసెమెంట్స్ మరియు మానేజ్మెంట్ హెచ్ ఓ డి పర్యవేక్షణలో నిర్వహించారు.

ఎమ్మెల్యే కోళ్ళ అసెంబ్లీలో గిరిజనుల సమస్యలను ప్రస్తావించడం హర్షణీయం

మాజీ ఎంపీపీ దాసరి లక్ష్మి

విశాలాంధ్ర - వేపాడ : ఏపీ అసెంబ్లీలో జరుగుతున్న సమావేశాల్లో ఎస్.కోట నియోజక వర్గంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ప్రస్తావించడం హర్షనీయమని వేపాడ మాజీ ఎంపీపీ దాసరి లక్ష్మి అన్నారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాలలో గిరిజనుల పట్ల, గిరిజనుల సమస్యల పట్ల, సమస్యల పరిష్కారానికి ఆమె చూపిస్తున్న చొరవ ఎమ్మెల్యే పరిపాలన దక్షతకు నిదర్శనమని ఆమె కొనియాడారు.అలాగే వేపాడ మండలంలోని పెద్ద కృష్ణరాజపురం పంచాయతీ శివారు గడబవలస గ్రామ గిరిజన ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గ్రామానికి తారు రోడ్డు నిర్మాణానికి 2.65 కోట్లు నిధులు మంజూరు చేయడంలో ఆమె కృషి ఎనలేనిదని అన్నారు. ఎమ్మెల్యే లలిత కుమారి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం పట్ల కట్టుబడి పని చేస్తున్నారని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో మండలంలో గిరిజనులు దగాపడ్డారని విమర్శించారు.గత ప్రభుత్వంలో పూర్తిగా మోసపోయిన గిరిజనుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే లలిత కుమారి చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయ మన్నారు. గిరిజనుల అభివృద్ధికి సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న ఎమ్మెల్యే లలిత కుమారికి తన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ కోచ్‌గా శ్రీరాములు

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్ : శృంగవరపుకోట కు చెందిన డాక్టర్ పొట్నూరు శ్రీరాములు ఈనెల 17వ తేదీ నుండి21వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం, నర్మదాపురంలో జరగబోవు జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ బ్యాడ్మింటన్ అండర్ 17 ఆంధ్రప్రదేశ్ జట్టుకు కోచ్ గా రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు తెలిపారని శ్రీరాములు అన్నారు. శ్రీరాములు ప్రస్తుతం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీరాములు భారత బ్యాడ్మింటన్ అసోసియేషన్ గ్రేడ్-1 అంపైర్‌గా, అనేక రాష్ట్ర జాతీయ, అంతర్జాతీయ పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. 2010లో న్యూఢిల్లీలో జరిగిన కామన్వెల్త్ క్రీడలకు టెక్నికల్ అఫీషియల్ గా వ్యవహరించారు. అటు క్రీడాకారుడిగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబరిచి, మూడు పర్యాయాలు విజయనగరం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శిగా సేవలందించి, ఎంతో మంది భావి భారత క్రీడాకారులను జిల్లా ,రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేస్తున్న క్రీడా ఖర్మాగారాన్ని సృష్టించిన ఒక కోచ్‌గా, ప్రస్తుతం రాష్ట్ర, జాతీయ, బ్యాడ్మింటన్ న్యాయ నిర్ణేతగా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీరాములు ఎంపిక పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యం నాయుడు ,ఎస్ జి ఎఫ్ కార్యదర్శి కే. కృష్ణంరాజు, ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బంగారు ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఇందుకూరి రఘు రాజు, గౌరవ అధ్యక్షులు ద్వారపురెడ్డి జగదీష్, అధ్యక్షులు డాక్టర్ కేవీ నాయుడు, సహాధ్యక్షులు డాక్టర్ వివిఎస్ ప్రసాద్, ఎం కే బి శ్రీను, అట్లూరి శ్రీ వెంకట్రావు, కార్యదర్శి నున్న సురేష్, ఎస్.కోట గ్రామ పెద్దలు డాక్టర్ ఎస్ వి సత్య శేఖర్, ఆనల మోహన్, ఆనల రమేష్, మంత సుబ్బారావు, కోచ్ ఎండి. ఖలీలుల్లా, గ్రామ క్రీడాకారులు శ్రీరాములును అభినందించారు.

జీడి రైతులకు పంట బీమాతో లబ్ధి

విశాలాంధ్ర - మెరకముడిదాం : వాతావరణ పరిస్థితుల ప్రభావంతో జీడి పంట దిగుబడి తగ్గుతున్న నేపథ్యంలో జీడి పంటకు ఇన్సూరెన్స్ చేసుకుంటే జీడి రైతులు నష్టపోకుండా ఉంటారని చీపురుపల్లి ఉద్యాన శాఖ అధికారి సిహెచ్ చంద్రశేఖర రావు భీమవరం గాతాడ రైతులతో అన్నారు. ఎకరా జీడి పంటకు రైతు వాటా ప్రీమియము 1500 రూపాయలు చెల్లిస్తే ఇన్సూరెన్స్ గరిష్ట లబ్ధి 30 వేల వరకు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ ఇన్సూరెన్స్ లబ్ధి పొందాలంటే ప్రతి ఒక్క రైతు వన్ బి, ఆధార్ నకలు, బ్యాంకు ఖాతా, వ్యవసాయ ఉద్యాన శాఖ అధికారుల నుండి పంట నిర్ధారణ ధ్రువీకరణ పత్రం అవసరమని అన్నారు. మండలంలో ఉన్న ప్రతి ఒక్క జీడు రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

వాలీబాల్ పోటీలో జాతీయ స్థాయికి ఎంపికైన ఆదర్శ పాఠశాల విద్యార్థిని

విశాలాంధ్ర - వేపాడ : మండల కేంద్రమైన వేపాడ శివారు బక్కు నాయుడుపేటలో గల ఆదర్శ పాఠశాల విద్యార్థిని స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో అండర్ -19 వాలీబాల్ పోటీలలో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వర రావు ఒక పర్యటనలో తెలిపారు.ఈ మేరకు ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం (ఎంఈసి) గ్రూపు చదువుతున్న విద్యార్థిని సింగంపల్లి హేమశ్రీ విజయవాడలో ఈనెల 9, 10, 11,తేదీలలో సిద్ధార్థ ఆర్ట్స్ మరియు సైన్స్ కాలేజీలలో నిర్వహించిన స్కూలు ఫెడరేషన్ అండర్ -19 వాలీబాల్ పోటీలలో విజయనగరం జిల్లా జట్టులో ఆడి ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొంటారని ప్రిన్సిపల్ ఈశ్వరరావు తెలిపారు.క్రీడా ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపాల్ వ్యాయామ ఉపాధ్యాయుడు రమణ,పాఠశాల సిబ్బంది అభినందించి కన్న తల్లిదండ్రులకు చదివిన పాఠశాలకు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన ఎమ్మెల్యే కోళ్ళ

విశాలాంధ్ర - వేపాడ : దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్.సత్య నారాయణను బుధవారం విజయవాడలో గల తన కార్యాలయంలో శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి,రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ళ అప్పల రాంప్రసాద్,లు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని దేవాదాయ శాఖకి సంబంధించిన పలు దేవాలయాల అభివృద్ధి,వాటి సమస్యలు పరిష్కారాల గురించి చర్చించారు. ఈ మేరకు పలు సమస్యలపై ఆయన సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి తెలిపారు.

నిరక్షరాస్యతను నిర్మూలించేందుకు ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర - జామి : రాష్ట్రంలో నిరక్షరాస్యతను నిర్మూలించేందుకు ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది. అందులో భాగంగా తాజాగా వయోజన విద్యశాఖా ద్వారా ప్రత్యేకంగా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎంపిడివో నీలం అప్పలనాయుడు తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా వెలుగు వివోఎలకు,విటిలకు నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన లెర్నింగ్ విద్యపై అవగాహన కల్పించారు. ఈశిక్షణలో సీతానగరం హిందీపండింట్‌గా పని చేస్తున్న మోహన్‌కుమార్ రిసోర్స్‌పెర్సన్‌గా పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివోతో పాటు ఎంఇవో జయశ్రీ, వెలుగు ఎపిఎం మధుమహేష్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సునీత, ఎవో నరసింహం తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణుల్లో అక్షరాస్యత శాతం పెరగాలి : ఎంపీడీఓ కిషోర్ కుమార్

విశాలాంధ్ర - భోగాపురం : 15 ఏళ్లకు పైగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరక్ష రాస్యులను అక్షరాస్యులుగా మార్చడమే 'ఉల్లాస్' ముఖ్య ఉద్దేశమని ఎంపీడీవో కె.కిషోర్ కుమార్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఓ అధ్యక్షతన 'ఉల్లాస్' అక్షరాస్యతా శిక్షణ కార్యక్రమం నిర్వ హించారు. మండల స్థాయి కమిటీ ఆధ్వ ర్యంలో గ్రామ సంఘ సహాయకులు, వాలంటరీ టీచర్లు, వెలుగు సిసి లకు మొత్తం 213 మందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రజల జీవన పరిస్థితులు మారిన నేపథ్యంలో ప్రతి అంశంలోనూ సాంకేతికత డిజిటల్ విధానం, నగదు రహిత లావాదేవీలు, ముఖ్యంగా మహిళలు పొదుపు సంఘాల్లో ఉండేలా చూడడం, బ్యాంక్ ఖాతాలు ఉన్న వారికి వారికి వాటిని నిర్వహించడం వచ్చేలా అన్ని విషయాలు తెలియజేయడమే ఉల్లాస్ లక్ష్యమని పేర్కొన్నారు. చదువురాని వారు పక్కవారిపై ఆధారపడుతున్న పద్ధతిని అధిగమించేలా అందరిలో ఆత్మ విశ్వాసాన్ని ప్రోది చేసేందుకు పూర్తి అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. 15 ఏళ్లు దాటిన వారికి విద్యను అందించే వ్యవస్థ ఏది ప్రస్తుతం అందుబాటులో లేదు. అందుకే ప్రత్యామ్నాయంగా గ్రామీణ ప్రాంతాల్లో వయోజన విద్యా కేంద్రాలను ప్రారంభించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కృషి చేస్తున్నాయి అన్నారు. కార్య క్రమం లొ ఎం ఈ ఒ ఎం. రమణ మూర్తి, ఏపి ఎం. జగదీశ్. ఎం ఎల్. ఒ. ఏ. వైకుంఠరావు. వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి గ్రంథాలయ వారోత్సవాలు

శాఖా గ్రంథాల అధికారి మేరీ నిర్మల

విశాలాంధ్ర - లక్కవరపుకోట : నేటి నుంచి ఈనెల 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయని మండల శాఖ గ్రంథాల అధికారి బి . మేరీ నిర్మల తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మొదటి రోజు గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం వేడుకలు, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన ఏర్పాటు మాదకద్రవ్యాల పై అవగాహన , పుస్తక పట్టణ ప్రాముఖ్యత, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, ఐ ఎన్ జి వెంకటరమణ మొదలైన వారిని స్మరించుట, 17న కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు, 18న పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్రీడా పోటీలు, 19న మహిళలకు రంగవల్లులు , అల్లికలు, 20న డిజిటల్ పై విద్యార్థులకు అవగాహన సామూహిక స్వీయ పటనమ్, వారోత్సవాలు ముగింపు కార్యక్రమాలు ఉంటాయని ఆమె తెలిపారు. ఆసక్తిగల పాఠకులు ఎవరైనా ఈ వారోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేస్తారని ఆమె కోరారు.

ఈ నెల 20లోగా బాంక్ గారంటీలను సమర్పించాలి

జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

విశాలాంధ్ర - విజయనగరం : ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి మిల్లర్లు బాంక్ గారంటీలను ఈ నెల 20 లోపల సమర్పించాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. బుధవారం తన ఛాంబర్ లో పౌర సరఫరాల అధికారులు మిల్లర్ల తో జేసీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లర్లు వారికి నిర్దేశించిన లక్ష్యాల మేరకు గోనె సంచులను ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశిత 33 శాతం గోనె సంచులు ఏర్పాటు చేయని యెడల ట్రక్ చిట్ జనరేషన్ జరగదని తెలిపారు. ఒకే మాదిరి తేమ యంత్రాలను కొనుగోలు చేయాలని తెలిపారు. అలాగే అవసరమగు హమాలీ లను కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ మీణకుమారి, డి.ఎస్.ఓ మధుసూదన్, మిల్లర్లు పాల్గొన్నారు.

ఐదు కిలోల గంజాయితో ముగ్గురు అరెస్టు : డీఎస్పీ శ్రీనివాసరావు

విశాలాంధ్ర - విజయనగరం రూరల్ : విజయనగరం రూరల్ పోలీసు స్టేషను ద్వారపూడి గ్రామ శివార్లలో ముగ్గురు వ్యక్తులు గంజాయి అమ్ముతుండగా అరెస్టు చేసినట్లుగా విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం విజయనగరం రూరల్ ఎస్సై వి అశోక్ కుమార్‌కు కొంత మంది వ్యక్తులు ద్వారపూడి గ్రామం శివారులో గంజాయి అమ్ముతున్నట్లుగా వచ్చిన సమాచారంపై విజయనగరం రూరల్ సిఐ బి.లక్ష్మణరావు, ఎస్సై అశోక్ కుమార్ మరియు సిబ్బంది రైడ్ చేసారన్నారు. పోలీసు బృందాన్ని చూసి, ముగ్గురు వ్యక్తులు పారిపోతుండగా పట్టుకొని విచారణ చెయ్యగా అందులో (1) మునకాల జగన్నాథం అనే వ్యక్తి వసంతవిహార్ రైల్వే స్టేషన్ దగ్గర నివాసం ఉంటూ ఒడిస్సా రాష్టంకు సంబందించిన వ్యక్తి దగ్గర 5 కేజీల గంజాయి కొని, ద్వారపూడి దగ్గరలో (2) విజయనగరంకు చెందిన బోని అఖిల్ (3) మూర్తి వెంకట ఆదిత్య కు చెరో కేజీ అమ్మినట్లు, మిగిలిన 3 కేజీల గంజాయి జగన్నాథం దగ్గర నుండి, మిగిలిన రెండు కేజీలను మరో ఇద్దరు వ్యక్తుల నుండి మొత్తం 5 కేజీల గంజాయిని డిప్యూటీ తహసీల్దార్ అయినా బి.సంజీవ కుమార్ గారి సమక్షంలో స్వాధీనం చేసికొని, వారి నుండి 2 మొబైల్స్, రూ. 2050/-ల క్యాష్‌ను సీజ్ చేసినట్లుగా డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. నిందితులు ముగ్గురిని విజయనగరం రూరల్ సిఐ బి.లక్ష్మణరావు అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టు కి పంపారన్నారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన సిఐ లక్ష్మణరావు, ఎస్సై అశోక్ కుమార్ ను విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు అభినందించారు.

తాగునీటిని వృధా చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదు

విశాలాంధ్ర - విజయనగరం అర్బన్ : తాగు నీటిని వృధా చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని విజయ నగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. బుదవారం నగరంలోని 3వ డివిజన్ మూడవ నెంబర్ సచివాలయ పరిధిలో జరిగిన డివిజన్ పర్యటనలో ఆయన పాల్గొన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకోవడంతో పాటు, అనుమతులు లేని నిర్మాణాలు, ఆక్రమణలను గమనించారు. అలాగే కుళాయిల ద్వారా పంపిణీ అవుతున్న తాగునీటిని వృధా చేస్తున్న సంఘటనలు చూశారు. దీనిపై అసహనం వ్యక్తం చేస్తూ తక్షణమే నీటిని వృధా చేస్తున్న వారి కుళాయి కనెక్షన్లను తొలగించాలని సిబ్బందికి ఆదేశించారు. పాదాలమ్మ గుడి ప్రక్కన ఉన్న పార్కులో చెత్తాచెదారాలు నిండి ఉండడాన్ని చూసి సిబ్బందిని మందలించారు. పార్కులలో తక్షణమే జెసిబిల సహాయంతో జంగిల్ క్లియరెన్స్ చేయించాలని సూచించారు. బకాయి వద్ద ఆస్తి పన్నులను తక్షణమే చెల్లించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో వ్యయ ప్రయాసలతో నీటి పంపిణీ చేపడుతున్నామని, అటువంటి నీటిని ప్రజలు వృధాగా చేయడం సహించలేకపోతున్నామని అన్నారు. కుళాయిలకు ఆన్ ఆఫ్ స్విచ్ లను తప్పనిసరిగా బిగించుకోవాలని చెప్పారు. సకాలంలో పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని చెప్పారు. రహదారులను ఆక్రమించి షెడ్డులు, తాత్కాలిక నిర్మాణాలు చేపట్టరాదని తెలిపారు. ఫ్లెక్సీలకు పోస్టర్లకు అతికించరాదని స్పష్టం చేశారు క్షేత్రస్థాయిలో పర్యటించిన ప్పుడే స్థానిక సమస్యలు తెలుస్తాయని వాటి పరిష్కారానికి ఆస్కారం ఉంటుందని సచివాలయ కార్యదర్శి ఉద్దేశించి అన్నారు ఈ కార్యక్రమంలో టిపిఆర్‌ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, ఆర్‌ఐ కిరణ్ కుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య విద్యార్థుల భవిష్యత్తును, మనుగడను కాపాడాలి

విశాలాంధ్ర - గరివిడి : వెనుకబడిన ఉత్తరాంధ్ర విజయనగరం జిల్లా గరివిడిలో 2016లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పశు వైద్య విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించి విద్యార్థులకు శిక్షణ కూడా ఇస్తున్నది. అయితే తదుపరి వచ్చిన గత ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విద్యార్థుల భవిష్యత్తు,విశ్వవిద్యాలయం మనుగడకు ప్రశ్నార్థకంగా మార్చిందనీ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, విజయనగరం జిల్లా అధ్యక్షులు నారు జనార్ధన రావు ఈరోజు గరివిడిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నుంచి వచ్చే నిధులలో తన వాటాగా 18% కలిపి విశ్వ విద్యాలయం నిర్మాణ అభివృద్ధికి చర్యలు తీసుకోవలసి ఉన్నప్పటికీ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన నిధులను కూడా దీనికోసం ఖర్చు చేయక వక్రదారి పట్టించడంతో అందులో చదువుతున్న విద్యార్థుల,విశ్వవిద్యాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఈ సమయంలోనే రాష్ట్రంలో ఏర్పడిన ఎండిఏ ప్రభుత్వం దృష్టికి స్థానిక శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు గారు చొరవతో గౌర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లగా స్పందించి యూనివర్సిటీ భవిష్యత్తును కాపాడుతూ అవసరమైన నిధులను మంజూరు చేస్తూ చర్యలు తీసుకోవటాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అభినందిస్తుంది.వెనుకబడిన ఉత్తరాంధ్రలో మరియు గ్రామీణ జీవన విధానం పశుసంపదతో ముడిపడి ఉన్నది. ఇలాంటి సమయంలో ఈ యూనివర్సిటీకి ఆర్థిక పరిపుష్టి కల్పించి ఎంతో నైపుణ్యం కలిగిన విద్యార్థులను తయారు చేయడం పాలకుల విదానంగా ఉండాలి తప్పితే వ్యవస్థ మనుగడనే ప్రశ్నించే స్థితికి తీసుకు రావడం సిగ్గుచేటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం పై అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం చదువుతున్న 68 మంది విద్యార్థుల భవిష్యత్తును కాపాడుతూ యూనివర్సిటీ కి రావలసిన సంపూర్ణ సహాయ సహకారాలు గ్రామీణ రైతుల జీవన విధానానికి మూలమైన విద్యా వ్యవస్థను కాపాడాలని సంఘం విజ్ఞప్తి చేస్తున్నది.ఈ సమయంలో అవసరమైన మేరకు విద్యార్థులకు యూనివర్సిటీకి అండగా రైతన్న ఉండాలని ఆ విధమైన చొరవకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉంటుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు తెలిపారు.

విద్యార్థుల గోడు వినండి 'బాబు'

- ఫీజ్ రియంబర్స్మెంట్ పై ప్రభుత్వ ప్రకటన కొరకు విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురుచూపులు
- విద్యాశాఖ మంత్రి వెంటనే ప్రకటించాలని తల్లిదండ్రులు కోరిక

విశాలాంధ్ర - రాజాం : డిగ్రీ, ఇంజనీరింగ్ తదితర ఉన్నత చదువుల విద్యార్థులకు 'ఫీజు రీయ ంబర్స్మెంట్ కష్టాలు మొదలయ్యాయి. ప్రభుత్వం నుంచి ఫీజు రీయంబర్స్మెంట్ కు సంబంధించి ఎటువంటి ఉత్తర్వులు వెలువడక పోవడంతో విద్యార్థులందరూ గందరగోళంలో పడ్డారు. గత వైకాపా ప్రభుత్వం హయాంలో 'తల్లుల ఖాతా' లో జమ అయ్యేవి. తల్లిదండ్రులు కళాశాలలకు ఫీజులు చెల్లించేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చింది. అధికారంలోకి వచ్చిన కొత్తలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తనను కళాశాలల యాజమాన్యాలతో మాట్లాడుతూ, 'ఫీజు రీయంబర్స్మెంట్ నేరుగా కళాశాలల ఖాతాల్లో జమ అయ్యేలా చేసే విషయం ఆలోచన చేస్తున్నామని, విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావద్దని చెప్పారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందించారు. అయితే, కళాశాలలకు 'ఫీజు రీయంబర్స్మెంట్' పై ఇప్పటివరకు ఎటువంటి ఉత్తర్వులు రాలేదు. దీంతో, ఫీజుల కోసం కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయి. ప్రస్తుతం పరీక్ష ఫీజులు కూడా చెల్లించాలి. టర్మ్ ఫీజు చెల్లిస్తేనేగాని, పరీక్ష ఫీజు తీసుకోరు. అలాగని, చెల్లించకపోతే, విద్యార్థి పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉండదని కళాశాలల యాజమాన్యాలు చెప్తున్నాయి. ఫీజు చెల్లించండి.. మా ఖాతాలోకి వస్తే మీకే ఇచ్చేస్తాం.. అని కళాశాలల యాజమాన్యాలు సున్నితంగా చెప్తూ, ఫీజు చెల్లింపులు తప్పనిసరి అని చెప్పకనే చెపుతున్నాయి. దీంతో విద్యార్థులు వారితోపాటు తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.ఫీజు రీయంబర్స్మెంట్ సౌకర్యం తో తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించుకుంటున్న చాలా మంది పేద తల్లిదండ్రులు ప్రస్తుతం తలెత్తిన 'పరిస్థితి' తో ఏమి చేయాలో అర్థంకాని సంకట పరిస్థితిలో పడ్డారు. ఇప్పటికైనా, విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించి, 'ఫీజు రీయంబర్స్మెంట్ చెల్లింపులపై స్పష్టత ఇచ్చి, తమ పిల్లల చదువులకు ఇబ్బంది కలగకుండా అవసరమైన చర్యలు గైకొనాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి జయంతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించిన విశ్వ బ్రాహ్మణ సంఘీయులు

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్టు : జగద్గురు వీరబ్రహ్మేంద్ర స్వామి 416 జయంతోత్సవాల సందర్భంగా విశ్వ బ్రాహ్మణ సంఘీయులు నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ప్రారంభించారు. బుధవారం స్థానిక న్యూపూర్ణ జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఏడాది పూర్తి కావస్తున్న సందర్భంలో వార్షికోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్తీక శుద్ధ ద్వాదశి కావడంతో స్వామివారికి అభిషేకములు, అలంకరణ, పూజా కార్యక్రమాలతో పాటు హోమాలను నిర్వహించారు. అనంతరం పేదలకు అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ కాలజ్ఞానాన్ని రచించిన వీరబ్రహ్మేంద్ర స్వామి వారి జయంతోత్సవ సందర్భంగా మరియు విగ్రహ ఏర్పాటు వార్షికోత్సవ సందర్భంగా వివిధ పూజా కార్యక్రమాలు, అన్న సమారాధన నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గత ఐదేళ్ల కాలంలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నగరంలో అన్ని ప్రాంతాలలో కులాలు, మతాలవారీగా వారి యొక్క కులదైవాల విగ్రహాలుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ఏర్పాటై ఏడాది అయిన సందర్భంలో స్వామివారికి పూజా కార్యక్రమాలు, అన్న సమారాధన ఏర్పాటు చేశారన్నారు. కలియుగ ప్రత్యక్ష దైవం, అవతార పురుషుడైన వీరబ్రహ్మేంద్రస్వామి కృపా కటాక్షాలు ప్రతి ఒక్కరి పైన ఉండాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘీయుల ప్రతినిధి మారోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ 416 సంవత్సరాలు క్రితం కాలజ్ఞానాన్ని రచించే వీరబ్రహ్మేంద్రస్వామి ప్రభవించడం ఈ సమాజ అదృష్టమని అన్నారు. భవిష్య కాలజ్ఞాన గ్రంథకర్త కలియుగ దైవమైన సద్గురు వీరబ్రహ్మేంద్రస్వామి మరలా వీరభోగవసంతరాయలుగా జన్మిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు విశ్వబ్రాహ్మణ సంఘీయులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పేజి : 2
విజయనగరం
గురువారం 14, నవంబర్ 2024

పోలింగ్ కేంద్రం పరిశీలించిన తహశీల్దార్ రాములమ్మ

విశాలాంధ్ర - వేపాడ : మండల కేంద్రమైన వేపాడ జిల్లా పరిషత్ హై స్కూల్ లో గల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రంను తహసిల్దార్ జె. రాములమ్మ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ ముగిసిందన్నారు. తదుపరి ఎన్నికల అధికారుల సూచనల మేరకు ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహించాల్సి ఉండగా ఈ మేరకు పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట మండల సర్వేయర్ కుమార్ విఆర్ఓ జిల్లా పరిషత్ హై స్కూల్ ఇంచార్జ్ హెచ్ఎం కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

7సం.లకు పైబడి శిక్షలు విధించే కేసుల్లో నిందితుల వేలిముద్రలు సేకరించాలి

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐ.పి.ఎస్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : జిల్లాలో వివిధ పోలీసు స్టేషనుల్లో పని చేస్తున్న పోలీసు అధికారులతో మాసాంతర నేర సమీక్షా సమావేశాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - నేరాల నియంత్రణకు షాపులు, వాణిజ్య సముదాయాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకొనే విధంగా ప్రజలను అధికారులు ప్రోత్సహించాలన్నారు. పోలీసు స్టేషనుకు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగే విధంగా చూడాలని, వారు స్టేషనుకు ఎందుకు వచ్చినది తెలుసుకొని, పరిష్కార మార్గాలను చూపాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. రాత్రి గస్తీ, పెట్రోలింగును మరింత పటిష్టవంతం చేయాలని, విధులకు వెళ్ళే ముందు వారు నిర్వహించాల్సిన విధుల గురించి అధికారులు బ్రీఫింగ్ చేయాలన్నారు. పోలీసు సిబ్బంది లాఠీలు, విజిల్ తమ వెంట తీసుకొని వెళ్ళాలని, వాహనాలకు సైరన్ అమర్చుకుని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు రాత్రి సమయాల్లో అనుమానస్పదంగా తిరిగే వ్యక్తుల వేలి ముద్రలను ఎం.ఎస్.సి.డి. పరికరాలతో తనిఖీ చేయాలన్నారు. రాత్రి 11 గంటల తరువాత అకారణంగా తిరిగే వ్యక్తులను స్టేషనుకు తరలించి, కౌన్సిలింగు నిర్వహించాలని, వారిపై కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులను వారంలో ఒక రోజు స్టేషను పిలిపించి, వారి ప్రవర్తన, జీవనోపాధికి చేస్తున్న వృత్తుల గురించి ఆరా తీయాలని, నేరాలకు మళ్ళీ పాల్పడతారన్న అనుమానం ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టాలని, ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వ్యక్తుల హిస్టరీ షీట్లును ఆయా స్టేషన్లుకు బదిలీ చేయాలన్నారు. పెండింగు నాన్ బెయిలబుల్ వారంట్లను ఎగ్జిక్యూట్ చేయాలని, అందుకు ప్రత్యేక టీమ్స్ ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన ప్రాపర్టీని ప్రత్యేకమైన కార్డు బోర్డుల్లో భద్రపర్చాలని, అందుకు సంబంధించిన ప్రాపర్టీ రిజిష్టరులో వివరాలను నమోదు చేయాలన్నారు. మరణించిన వ్యక్తుల మరణ ధృవీకరణ పత్రం తీసుకొని, ఆయా వ్యక్తుల హిస్టరీ షీట్లును మూసివేసేందుకు ప్రతిపాదనలను పంపాలన్నారు. కేసుల నమోదు, దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు సిసిటిఎన్ఎస్ లో నమోదు చేయాలన్నారు. 7సం.లకు పైబడి శిక్ష పడే అన్ని కేసుల్లో అరెస్టు కాబడిన నిందితుల వేలి ముద్రలను లైవ్ స్కానర్లలో తీసుకోవాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వహించకుండా కఠినంగా వ్యవహరించాలని, అటువంటి వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ఇసుక అక్రమ రవాణ జరగకుండా చూడాలన్నారు. దాబాల్లో మద్యం సరఫరా జరగకుండా చూడాలని, ఎవరైనా మద్యం సరఫరా చేస్తే వారిపై ఎన్ఫోర్స్మెంటు కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. డయల్ 112/100కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, గ్రామాల్లోను, పట్టణాల్లో పేకాట, కోడి పందాలు నిర్వహించకుండా చూడాలని, ముందస్తు సమాచారాన్ని సేకరించి, విస్తృతంగా దారులు నిర్వహించాలన్నారు. పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ సిస్టమ్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై, నిర్దిష్ట సమయంలోగా విచారణ పూర్తి చేసి, నివేదికలను పోలీసు కార్యాలయంకు పంపాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. డిసెంబరు 14న జరిగే లోక్ ఆధాలత్‌లో ఎక్కువ కేసులు డిస్పోజ్ అయ్యే విధంగా ఇప్పటి నుండే ప్రణాళికతోపని చేయాలన్నారు. మిస్సింగు కేసుల్లో అలసత్వం వద్దని, కేసు నమోదైన వెంటనే దర్యాప్తు ముమ్మరం చేయాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, వారి ఆచూకీ కనుగొనాలన్నారు. ఎన్డీపీఎస్ కేసుల్లో గంజాయి విక్రయాలు జరిపి, పట్టుబడిన వారిపై సస్పెక్ట్ షీట్లును ఓపెన్ చేసి, వారిపై నిఘా పెట్టాలన్నారు. రహదారి భద్రతకు ఎన్ఫోర్సుమెంటు కేసులను పెంచాలని, ఎం.వి. నిబంధనలు అతిక్రమించిన వారి పైనా, మద్యం సేవించిన వారిపైనా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపైనా కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టుబడిన ఫైర్ క్రాకర్సు బాంబ్ డిస్పోజల్ బృందాల సహకారంతో గ్రామ శివార్లలో డిస్పోజ్ చేయాలన్నారు. సంకల్పం ఫ్లెక్సీలను, హోర్డింగులను ముఖ్య ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని, డ్రాప్ బాక్సులను కూడా బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసి, అందులో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి, చర్యలు చేపట్టాలన్నారు. వివిధ పోలీసు స్టేషన్లులో నమోదై, దర్యాప్తులో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసులు, పోక్సో కేసులు, ఎన్డీపిఎస్, మిస్సింగు, 194 బి.ఎన్.ఎస్. కేసులు, మహిళలపై జరుగుతున్న దాడుల కేసులను, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను జిల్లా ఎస్పీ సమీక్షించి, దర్యాప్తు పెండింగులో ఉండుటకుగల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని, దర్యాప్తు పూర్తి చేయుటకు అధికారులకు జిల్లా ఎస్పీ దిశా నిర్దేశం చేసి, గ్రేవ్ కేసుల్లో 60 రోజుల్లోగా అభియోగ పత్రాలు దాఖలు చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ఈ నేర సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డిఎస్పీ పి.శ్రీనివాసరావు, చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘవులు, డిటిసి డిఎస్పీ వీరకుమార్, ఎఆర్ డిఎస్పీ యూనివర్స్, న్యాయ సలహాదారులు వై.పరశురాం, పలువురు సీఐలు, వివిధ పోలీసు స్టేషనుల్లో ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర వార్తకు స్పందించిన రాజాం మున్సిపల్ కమిషనర్

విశాలాంధ్ర - రాజాం : గత రెండు రోజుల క్రితం విశాలాంధ్ర పత్రిక లిలిప్రధాన కూడలి, రహదారిపై లైట్లు వెలగకపోయినా పట్టించుకోని సిబ్బందిలిలిలి అనే శీర్షిక ప్రచురించడంతో వెంటనే రాజాం మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు స్పందించి స్టాకు ఉన్న మేరకు సెంట్రల్ లైటింగ్ లో ఉన్న వెలగని 120 వాల్ట్స్ లైట్లును వెంటనే తొలగించి వెలిగే లైట్లు అమర్చమని ఏఈ భాగ్యలక్ష్మి కు ఆదేశించారు. అంబేద్కర్ జంక్షన్, బొబ్బిలి జంక్షన్ లో వెలిగే 200 వాల్ట్స్ లైట్ల ప్రస్తుతానికి స్టాకు లేనందు వలన వాటిని మార్చలేదని త్వరలో స్టాకు వస్తుంది వెంటనే మారుస్తామని ఏఈ భాగ్యలక్ష్మి తెలిపారు.

ఉద్దవోలు సర్పంచ్ ప్రతినిధి విజయ ప్రశాద్

విశాలాంధ్ర - తెర్లాం : మండలంలో ఉద్దవోలు గ్రామ సర్పంచ్ ప్రతినిధి ఎచ్చర్ల విజయ ప్రశాద్ మంగళవారం రాత్రి 8:00 గంటల సమయంలో అనారోగ్యం తో బాధపడుతూ మరణించారు. అని స్థానిక బంధువులు తెలిపారు. కృష్ణ మాస్టర్ మరణించిన తరువాత తాను సర్పంచ్ ప్రతినిధి గా ఉద్ద వోలు గ్రామానికి ఎన్నో సేవలు అందించారు, సి బి ఎమ్ చర్చి విషయల లో ముందుకు నడిపించి స్నేహ తుడిగా, ఉపాధ్యాయుడుగా, సంఘ కాపరిగా, రాజకీయ నాయకుడిగా, మంచి మనసున్న మనిషిగా ఈ భూమి ఋణం తీర్చుకున్నారని ప్రజలు తెలిపారు.

త్రో బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు చింతలపేట విద్యార్థులు

విశాలాంధ్ర - గుర్ల : త్రోబోల్ రాష్ట్రస్థాయి పోటీలకు చింతలపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు మురళి, కార్తీక్, హేమంత్, ఉమ పి ఈ టి లక్ష్మణ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు విజయనగరంలో జరిగిన ఎంపికలో ఈ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు పాఠశాల క్రీడా విద్యార్థులు పాఠశాల హెచ్ఎం గ్రామ పెద్దలు ఆనందం వ్యక్తం చేశారు.

జనసైనికుల ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - భోగాపురం : రావాడ గ్రామంలో అగ్ని ప్రమాదం సంభవించి ఇల్లు కాలిపోయిన సంగతి తెలిసిందే. అగ్ని ప్రమాదంలో సమస్తం కోల్పోయిన బాధితులు పోలిపల్లి శాంత, వరలక్ష్మి లకు మండల జనసేన నాయకులు ఆర్థిక సహాయం అందించారు. ఎమ్మెల్యే లోకం మాధవి ఆదేశాలు మేరకు భోగాపురం జనసేన మండల పార్టీ అధ్యక్షుడు వందనాల రమణ,మట్ట అయ్యప్ప రెడ్డి, చెల్లిబోయిన నర్సింగరావు, కొండాపు రాధాకృష్ణ, బొల్లు త్రినాధ్, లంక సత్యనారాయణ, రావాడ జనసేన నాయకులు సహాయంతో పదిహేను వేల రూపాయలు విలువ చేసే నిత్యవసర సరుకులు, పది వేల రూపాయలు బాధితులు కు అందించారు. ఈ కార్యక్రమంలో రావాడ గ్రామ జనసేన నాయకులు కొండపు రాధాకృష్ణ, గండిబోయిన రాంబాబు మూర్తి, సీతమ్ నాయుడు, పైడిరాజు కిరణ్, సుధీర్, శంకర్, అప్పారావు, మహాలక్ష్మి, కృష్ణ, శ్రీను, వాళ్ల మోహన్ బండారు మోహన్ అప్పలరాజు, బొగత రాంబాబు, కొలి రాంబాబు, కొయ్య నర్సింగ్, రావాడ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎల్ఐసి ఏజెంట్లకు అన్యాయం చేయడం తగదు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి)లో ఇటీవల యాజమాన్యం ప్రవేశపెట్టిన మార్పుల వల్ల ఏజెంట్ల మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఐఆర్ డిఎ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ ఎన్ గజపతిరావు ఆవేదన వ్యక్తం చేశారు. లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫీ) విజయనగరం బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా పరిషత్ మినిస్టీరియల్ ఉద్యోగుల భవనంలో విశాఖపట్నం డివిజన్ ఏజెంట్లు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గజపతిరావు మాట్లాడుతూ దేశ నిర్మాణంలో భాగస్వాములైన ఏజెంట్లకు అన్యాయం చేయడం యాజమాన్యానికి తగదన్నారు. ఇటీవల యాజమాన్యం తీసుకున్న తిరోగమన నిర్ణయాల వల్ల ఏజెంట్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. క్లాబ్లాక్ విధానం దుర్మార్గమని, దీనిని అమలు చేయబోమని రాత పూర్వక హామీ ఇవ్వాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ విశాఖ డివిజన్ అధ్యక్షుడు బి తిరుమలరావు, కార్యదర్శి ఎన్ విఆర్ వి రావు, ఆలిండియా కమిటీ సభ్యుడు కెవి రమణ, జోనల్ కమిటీ సభ్యుడు బద్దుకొండ వెంకట రమణ, ఎల్ఐసి రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు ఎం శ్రీనివాస, విజయనగరం బ్రాంచ్ అధ్యక్షుడు చిల్ల రామకృష్ణ, కార్యదర్శి ఇల్లాపు కృష్ణ కోశాధికారి తుమ్మలగుంటి పవన్ కుమార్, యూనియన్ గౌరవ అధ్యక్షుడు సబ్బవరపు సూరినాయుడు, డివిజన్ ఉపాధ్యక్షుడు జరజాపు వాసుదేవరావు, యూనియన్ నాయకులు నాగేంద్ర, శివకుమార్, కామేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే కేసులు పెట్టడమేనా మీ కూటమి పరిపాలన...?

కార్యకర్తలు అధైర్య పడవద్దు మీకు అండగా మేముంటాం

విశాలాంధ్ర - రాజాం : తెలుగు దేశం పార్టీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ లు జగన్మోహన్ రెడ్డి ఆయన కుటుంబ సభ్యులపై, పార్టీ నాయకులపై చాలా దారుణంగా మార్ఫింగ్ ఫోటోలతో పోస్ట్ లు పెడుతున్నారు వారిపై కూడా చర్యలు తీసుకోవాలని కూటమి ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నాం. విజయనగరం మాజీ పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ (పెదబాబు), రాజాం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ రాజేష్ తలే, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్ మోహన్ రావు.ప్రభుత్వ అసమర్థతను ప్రశ్నిస్తే కేసులు పెడతారా.ఇదెక్కడి పాలన చంద్రబాబు.వైయస్సార్ సీపీ కార్యకర్తలే టార్గెట్ గా కేసులు పెడుతూ అరెస్ట్ లు చేస్తున్నారు.ఏ ఒక్కరూ అధైర్యపడకండి.. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సునాయాసంగా హామీలిస్తారు వదిలిపెట్టేస్తారు 2014లో హామీలన్నీ అలాగే చేసారు. రుణమాఫీ, సున్నావడ్డీ, ధరల స్థిరీకరణ, డ్వాక్రా రుణమాఫీ, సున్నావడ్డీ, చేనేత రుణాలు, నిరుద్యోగ భృతి అన్ని హామీలూ ఎగరగొట్టారు. 2024లో అబద్ధాలతో మళ్లీ ప్రజలను నమ్మించారు గతంలో రోశయ్యగారు, వైయస్ఆర్ కూడా చంద్రబాబు హామీల తీరు గురించి విమర్శించారు. ప్రతిసారి ప్రజలు చంద్రబాబు మాటలు నమ్మి మోసపోతున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బండి.నరసింహులు, టౌన్ కన్వీనర్ పాలవలస. శ్రీనివాస రావు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు వాకముల్ల. చిన్నం నాయుడు, వైస్ ఎంపీపీ యాలాల.వెంకటేష్, ప్రసాద్,బాబూరావు మరియు నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

గుర్ల గ్రంథాలయ అధికారి పి.రామారావు

విశాలాంధ్ర - గుర్ల : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గుర్ల గ్రంథాలయంలో నిర్వహిస్తు న్నామని. గ్రంథాలయ అధికారి పి.రామారావు బుధవారం తెలిపారు. వారోత్సవాలుకు సంబంధించిన పోస్టర్ ను బుధవారం తన గ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా 14న బాలల దినోత్సవ, 15న మాదకద్రవ్యాలపై అవగాహన-పుస్తక పటన ప్రాముఖ్యత పై కార్యక్రమాలు, 16న గ్రంధాలయ ఉద్యమ ప్రముఖులను స్మర్యించుకునే కార్యక్రమాలు, 17న కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు 18న పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు, చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, క్రీడా పోటీలను నిర్వహణ 19న మహిళలకు వివిధ అంశాల్లో పోటులు నిర్వహిస్తామన్నారు. 20న డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని గ్రంథాలయ అధికారి పి.రామారావు తెలిపారు.

గంజాయి కేసులో పరారైన వ్యక్తి అరెస్ట్



విశాలాంధ్ర - శృంగవరపుకోట టౌన్ : గంజాయి తరలిస్తున్న కేసులో పరారైన వ్యక్తిని బుధవారం అదుపులోకి తీసుకున్నామని సీఐ వేచలపు నారాయణమూర్తి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గత సంవత్సరం మే నెలలో అల్లూరి సీతారామరాజు జిల్లా దుంబ్రిగూడ మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్పై గంజాయితో ఎస్.కోట వైపు వస్తూ ఉండగా వారిని పట్టుకొనే సమయంలో ఒక వ్యక్తి దొరకగా మరొక వ్యక్తి బైక్‌తో పాటు పరారయ్యాడని పరారైన వ్యక్తిని బుధవారం పట్టణంలోని పందిరి అప్పన్న జంక్షన్ వద్ద బైక్‌తో పాటు పట్టుకొని కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. గంజాయి అమ్మకాలు రవాణా చేసే వారితో పాటు సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి రవాణా అమ్మకాల కేసులో పరారీలో ఉన్న వారిని ఎక్కడ ఉన్నా వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తులసి కళ్యాణం

విశాలాంధ్ర - జామి : మండలంలోని కుమరాం కళ్యాణ్ నగర్‌లో ఉన్న శ్రీఐశ్వర్య లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో కార్తీక మాస పూజా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామి వారికి తులసి కళ్యాణం నిర్వహించారు. అత్యంత వైభవంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు అధికంగా పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపక అర్చకులు కందాళ ప్రసాద్ స్వామికి వారికి ప్రత్యేక అలంకరణ చేయడమే కాకుండా విశేష పూజలు నిర్వహించారు.

ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మిను అభినంధించిన మండల విద్యాశాఖాధికారి

విశాలాంధ్ర - దత్తిరాజేరు : ఇటీవల స్కూల్ గేమ్స్ లో తరచుగా రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటుతున్న మోడల్ స్కూల్ విద్యార్థులను మరియు ప్రిన్సిపాల్‌ను మండల విద్యాశాఖాధికారి -2 సుదర్శన్ రావు బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈనెల గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీల్లో పాల్గొన్న ఐదుగురు విద్యార్థులను (క్రీడాకారులు) కలిసి వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సంవత్సరంలో స్కూల్ గేమ్స్ నందు తరచుగా సుమారు 30 మంది విద్యార్థులు ఎంపిక అవ్వడం చాలా సంతోషమని అన్నారు క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇవ్వాలని పిడి రాజేష్ కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటోమొబైల్ షాప్, ఎలక్ట్రికల్ మరియు పండ్ల దుకాణాలపై ప్రత్యేక దాడులు

విశాలాంధ్ర - విజయనగరం పోర్ట్ : విజయనగరం పట్టణంలో బుధవారం లీగల్ మెట్రాలజీ అధికారులు ఆటోమొబైల్ షాపులు, ఎలక్ట్రికల్, పండ్ల దుకాణాలు పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆటోమొబైల్ షాప్ లపై ఐదు కేసులు, ఎలక్ట్రానిక్ షాపులపై మూడు కేసులు మరియు పండ్ల వర్తకులపై మూడు కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఆటోమొబైల్ షాప్ మరియు ఎలక్ట్రికల్ షాప్ లలో ప్యాకెజీ లపై కంపెనీ పూర్తి చిరునామా, గరిష్ట ధర, తయారీ తేదీలు లేనట్లు గుర్తించి వారికి ఇకపై నాణ్యత గల ప్యాకేజిలను మాత్రమే విక్రాయించాలని సూచించారు. గంట స్థంభం దగ్గర పండ్ల వర్తకులు కేజీ పై 150 గ్రాములు మరియు అరకేజీ పై 100 గ్రాముల వరకు తూకంలో మోసం చేస్తున్నట్లు గుర్తించి వారిని ఇకపై ఇటువంటి మోసాలకు పాల్పడవద్దని హెచ్చరించి అపరాధ రుసుము విధించారు. ఇన్స్పెక్టర్ దామోదర నాయుడు మాట్లాడుతూ ఎవరైనా తూకంలో గానీ, కొలతలో గానీ, అధిక ధరలకు విక్రయించినా తమ శాఖ కు ఫిర్యాదు చేయాలని కోరారు.

మోటారు ప్రమాద బీమా కేసులను పరిష్కరించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి

విశాలాంధ్ర - విజయనగరం అర్బన్ : మోటారు ప్రమాద బీమా కేసులను పరిష్కరించాలి జిల్లా ప్రధాన న్యాయ మూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి ఆదే శించారు. బుదవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి గారి చాంబర్స్ లో ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీలకు సంబంధించిన అధికారులతో మోటారు ప్రమాద బీమా కేసులకు సంబంధించి డిసెంబర్ 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలని సంబంధిత కంపెనీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో న్యాయమూర్తులు పోక్సో జడ్జ్ కే నాగమణి, ఎస్సీ ఎస్టీ కోర్టు జడ్జ్ అప్పలస్వామి, మహిళా కోర్టు జడ్జి పద్మావతి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి టీ.వీ రాజేష్ కుమార్ మొదలగు వారు పాల్గొన్నారు.

దేవాలయాల సమస్యలను ఉల్లాష్ కార్యక్రమంపై శిక్షణ

విశాలాంధ్ర - తెర్లాం : మండలంలో స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాష్ కార్యక్రమంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆర్.రాంబాబు వారి ఆధ్వర్యంలో గ్రామైక్య సంఘల పరిధిలో పలువురు మహిళలకు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి పాపారవు, ఏపియమ్ వెలుగు రాము , సిసిలు, విఒఎలు, గ్రామైక్య సంఘాల మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

100 రోజుల ప్రణాళికల లక్ష్యాలపై సమీక్షించిన జేసీ సేతు మాధవన్

విశాలాంధ్ర - విజయనగరం : స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలను శత శాతం సాధించాలని జేసీ సేతు మాధవన్ తెలిపారు. బుధవారం ఆయన ఛాంబర్ లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో 100 రోజుల ప్రణాళికల పురోగతి, వచ్చే వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక, ఏడైై, మూడేళ్ళ, ఐదేళ్ల ప్రణాళికల పై సమీక్షించారు. నివేదికలలో ఖచ్చితమైన సమాచారాన్ని పొందుపరచాలని, లక్ష్యాలను సాధించలేక పోతే ఎందుకు సాధించలేదు కారణాలను ఖచ్చితంగా రాయాలని అధికారులకు సూచించారు. ప్రతి శాఖ వారి లక్ష్యాలను ఆన్లైన్ లో పెట్టేటప్పుడు జిల్లా కలెక్టర్ ఆమోదాన్ని తప్పనిసరిగా పొందాలని అన్నారు.

ఇయర్ ఎండ్ సేల్ ప్రారంభించిన టయోటా కిర్లోస్కర్ మోటార్

విశాలాంధ్ర - విజయనగరం : టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) దాని ప్రసిద్ధ మోడల్ కార్లు గ్లాన్జా, అర్బన్ క్రూయిజర్ టైసర్, అర్బన్ క్రూయిజర్ హైరైడర్ లలో ప్రత్యేకమైన లిమిటెడ్ ఎడిషన్‌ను విడుదల చేసినట్టు టొయోటా కిర్లోస్కర్ మోటర్ సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ బిజినెస్ హెడ్ శబరి మనోహర్ తెలిపారు. ఇటీవల విడుదల చేసిన ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్‌లకు అద్భుతమైన స్పందన వచ్చిన తరువాత, స్పెషల్ లిమిటెడ్ ఎడిషన్ టొయోటా జెన్యూన్ యాక్సెసరీ (టిజిఎ) ప్యాకేజీలను అందించడం ద్వారా వినియోగదారుల కేంద్రీకృత పట్ల టొయోటా యొక్క నిబద్ధతను మరింత ముందుకు తీసుకువెళ్లిందన్నారు. స్పెషల్ లిమిటెడ్ ఎడిషన్ కాకుండా, టొయోటాగ్లాంజా, అర్బన్ క్రూయిజర్ టైసర్ రూమియన్ (సీఎన్జీ మోడల్‌లు మినహా)లో రూ.1 లక్ష పైన ప్రత్యేకమైన ఇయర్ ఎండ్ ఆఫర్‌లను అందిస్తోందన్నారు. ఈ ప్రయోజనాలు 31 డిసెంబర్ 2024 వరకు కొనసాగుతాయన్నారు. గతంలో ప్రకటించిన గ్లాన్జా, అర్బన్ క్రూయిజర్ టైసర్, అర్బన్ క్రూయిజర్ హైరైడర్ యొక్క ఫెస్టివల్ ఎడిషన్‌లకు అద్భుతమైన స్పందన లభించిందన్నారు. ప్రతి ఒక్కటి ప్రీమియం స్టైలింగ్, అధునాతన ఫీచర్‌ల యొక్క ప్రత్యేకమైన కలయికను అందిస్తోందన్నారు. గ్లాన్జా, అర్బన్ క్రూయిజర్ టైసర్ అర్బన్ క్రూయిజర్ హైరైడర్ యొక్క స్పెషల్ లిమిటెడ్ ఎడిషన్ బుకింగ్‌లు ఇప్పుడు అన్ని టయోటా డీలర్‌షిప్‌లలో తెరవబడ్డాయని, అలాగే ఆన్‌లైన్‌లో www.toyotabharat.com లో వద్ద కూడా బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు.

ముమ్మరంగా ఎన్‌పిసిఐ అనుసంధాన ప్రక్రియ

విశాలాంధ్ర - విజయనగరం అర్బన్ : విజయనగరంలోని అన్ని సచివాలయం పరిధిలో నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) అనుసంధాన ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ఎన్పీసీఐ లింక్ కాకపోవడంతో చాలామంది లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందలేదు. దీంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకు ఖాతాలతో ఎన్పీసీఐ అనుసంధాన ప్రక్రియ తప్పనిసరి చేసింది. విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాల మేరకు సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించి ప్రతి ఒక్కరితో బ్యాంకు ఖాతాలు తెరిచే విధంగా కృషి చేస్తున్నారు. ఇందుకోసం త్వరితగతిన ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు పోస్టల్ శాఖతో 200 రూపాయలకే ఎకౌంట్లు తెరిపించే విధానాన్ని కమిషనర్ పల్లి నల్లనయ్య తీసుకొచ్చారు. దీంతో అనుసంధాన ప్రక్రియ వేగంగా సాగుతోంది. అందరి ఖాతాలను ఎన్పీసీఐతో అనుసంధానం జరిపించడమే తమ ప్రధాన కర్తవ్యం అని కమిషనర్ పల్లి నల్లనయ్య ఈ సందర్భంగా తెలిపారు.

కార్మికుని మృతికి దినసరి వేతనం కేటాయింపు



విశాలాంధ్ర - మెరకముడిదాం : మండల లో ఇటీవల గర్భాం మార్కెట్ యార్డ్ మలుపు వద్ద గర్భాం గ్రామానికి చెందిన ఎస్ఎంఎస్ ఫ్యాక్టరీ కార్మికుడు తాడ్డి రాంబాబు వ్యాను ఢీకొన్న సంఘటనలో మృతి చెందాడు. ఈ సంఘటనతో కలత చెంది తోటి కార్మికులంతా ఒకరోజు దినసరి వేతనాన్ని కేటాయించారు. దీనికి తోడు యాజమాన్యం కొంత కలిపి రూ.1,27,000లను యూనిట్ హెడ్ వాకాడ గోపి రాంబాబు భార్య ప్రముఖ అందజేసి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ వివిధ విభాగాల మేనేజర్లు పక్కి శ్రీనివాసరావు, ఉప్పు శ్రీనివాసరావు మరియు శివకుమార్ సత్యనారాయణ సరిది రాంబాబు, కామేష్, బొత్స రాము తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - జామి : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈనెల 14నుంచి నిర్వహించనున్నట్లు జామి గ్రంథాలయ అధికారి ఎస్.సోమునాయుడు తెలిపారు. అందులో భాగంగా వారోత్సవాల కరపత్రాలను బుధవారం మండల విద్యాశాఖాధికారిణి జె. జయశ్రీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈనెల 14నుంచి 20 వరకు వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని, పుస్తక ప్రదర్శన, దిశ చట్టంపై సాధికారిక చర్చ, విద్యార్థులతో వివిధఅంశాలపై రచానా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

ఆయుష్షును పెంచే 'ఆయుష్' శాఖా వైద్యం

- దీర్ఘకాలిక రోగాల నయం ఆయుష్ తో సునాయాసం
- డయాబెటీస్ ను కూడా నియంత్రించవచ్చు
- ఆయుష్ శాఖ ద్వారా ఐదురకాల వైద్య పద్ధతులు
- ఆయుష్ అవగాహనా సదస్సులో డా. వెంకటమధు వెల్లడి

విశాలాంధ్ర - గుర్ల : డయాబెటీస్‌ను ఆయుష్ సేవల ద్వారా నయం చేయవచ్చని ఆయుష్ హెూమియోపతి వైద్యాధికారి డాక్టర్ డి. వెంకటమధు అన్నారు. బుధవారం తెట్టంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎంఎల్‌పిహెచ్, ఆశా కార్యకర్తలతో ఆయన మధుమేహం వ్యాధిని నియంత్రయించే విధానంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటమధు మాట్లాడుతూ డయాబెటీస్ వ్యాధిని ఆయుష్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో అందిస్తోన్న ఐదు రకాల వైద్య సేవల ద్వారా ఎలా అదుపులో ఉంచుకోవచ్చుని తెలిపారు. ఆయుష్ (ఏ వై యూ ఎస్ హెచ్) అంటే ఆయుర్వేదం, యోగా ప్రకృతి వైద్యం, యునాని, సిద్ధ, హెూమోయెపతిలను ఐదు రకాల వైద్య విధానాలని నిర్వచించారు. ప్రభుత్వం ఆయుష్ శాఖా ఆధ్వర్యంలో అందిస్తున్న వైద్య విధానాల ద్వారా ఎటువంటి అల్లోపతి(ఇంగ్లీష్) మందులు వాడకుండా మధుమేహం వ్యాధిని సునాయాసంగా అదుపులో పెట్టుకోవచ్చన్నారు. జీవన శైలీలో మార్పులతో పాటు ఒత్తిడి గల దైనందిన జీవితంలో ఆబాలగోపాలం మధుమేహం వ్యాధి బారిన పడుతుండటం బాధాకరం అన్నారు. ఈ క్రమంలో దయాబెటీస్ వచ్చిన వెనువెంటనే ఇంగ్లీష మందులు వాడటం వల్ల ఒక పక్క వ్యాధిని నియంత్రిస్తున్నప్పటికీ మరో పక్క ఇతర ఆరోగ్య దుష్ఫలితాలు సంభవిస్తుండటం పరిపాటి అన్నారు. అయితే ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న ఐదు రకాల వైద్య విధానాల ద్వారా చికిత్సలు తీసుకుంటే వ్యాధిని నియంత్రించడంతోపాటు ఎటువంటి ఇతర దుష్ఫలితాలు తలెత్తవని సూచించారు. కాబట్టి ప్రతీ మధుమేహం రోగీ ఆయుష్ శాఖ అందిస్తున్న వైద్యసేవలను వినియోగించుకోవాలని కోరారు. ఎమ్ఎల్‌పిహెచ్‌లు, ఆశా కార్యకర్తలు ప్రజలకు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటారు కాబట్టి ఆయుష్ సేవలను ప్రజలకు చేరువేయడంలో తమవంతు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గుర్ల నేచురోపతి వైద్యాధికారిణి డాక్టర్ రజితారోయ్, గరివిడి పీహెచ్‌సీ పరిధిలోని ఎంఎల్‌పిహెచ్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.